వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 216 బుధవారం | 28 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# పాలకుల తీరు.. మారాలి



**ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి**
**దివాళా దిశగా రాష్ట్రాలు..**
**మేధావుల మౌనం సరికాదు..**
**పాలకుల అవినీతిని నిలదీయాలి**
**అవినీతి పాలనలపై చర్చించాలి..**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. ప్రతిదానికి కేంద్రం సాయం చేయాలని దేబరిస్తున్నాయి. అదే పనిగా అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపుతున్నాయి. తెలంగాణనే తీసుకుంటే 75వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే గత సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంతగా పెరిగాయో గమనించవచ్చు. ప్రభుత్వ నిర్వహణ అంటే కేవలం అప్పులు చేసి, ప్రజలకు నగదు బదిలీ చేయడం కాదని ఆర్థిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.
- వరంగల్ వాయిస్, ప్రతినిధి

వివరాలు 2లో..



8లో..

# బండి సంజయ్‌పై దాడి

**కోడిగుడ్లను విసిరిన దుండగులు**
**పీవీ స్వగ్రామం వంగరలో ఘటన**



### పోలీసులు అలెర్ట్..

బండి సంజయ్‌పై దాడిపై ఆయన సీరియస్ అయిన నేపథ్యంలో పోలీసులు అలెర్ట్ అయ్యారు. బండి సంజయ్‌పై కోడిగుడ్లు విసిరిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్త గజ్జెల సురేష్ దాడికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకే కాంగ్రెస్ కార్యకర్తలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని బీజేపీ శ్రేణుల ఆరోపిస్తున్నారు.




2లో

# వనదేవతల దీవెనలు అందరిపై ఉంటాయి

**జాతర నిర్వహణతో ఎంతో అనుభవం**
**మీడియా ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు**
**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**



## సీఎం రేవంత్‌ను కలిసిన మీడియా అకాడమీ చైర్మన్

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ గా నియామకమైన సందర్భంగా సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మీడియా అకాడమీ చైర్మన్, ప్రజాపక్షం ఎడిటర్ శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. - వరంగల్ వాయిస్, హైదరాబాద్

## భద్రకాళి సేవలో ఏపీ మంత్రి రోజా

**అమ్మవారికి ప్రత్యేక పూజలు**



8 లో..

# పాలకుల తీరు.. మారాలి



**ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి**

**దివాళా దిశగా రాష్ట్రాలు..**

**మేధావుల మౌనం సరికాదు..**

**పాలకుల అవినీతిని నిలదీయాలి**

**అవినీతి పాలనలపై చర్చించాలి..**

**వరంగల్ వాయిస్, ప్రతినిధి :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. ప్రతిదానికి కేంద్రం సాయం చేయాలని దేబరిస్తున్నాయి. అదే పనిగా అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపుతున్నాయి. తెలంగాణనే తీసుకుంటే 75వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే గత సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంతగా పెరిగాయో గమనించవచ్చు. ప్రభుత్వ నిర్వహణ అంటే కేవలం అప్పులు చేసి, ప్రజలకు నగదు బదిలీ చేయడం కాదని ఆర్థిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### దివాళా దిశగా రాష్ట్రాలు..

రాష్ట్రాలన్ని ఇలా దివాళా దిశగా ఉన్నాయి. ఎక్కడా అభివృద్ధి కన్నా ఓట్లు రాబట్టే పథకాలే సాగుతున్నాయి. ఇందుకు ఏ రాష్ట్రం కూడా మినహాయింపు కాదు. అభివృద్ధి పక్కకు పోయింది. తెలంగాణలో కాళేశ్వరంపై తప్పులు ఒప్పుకోకుండా బీఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. ఏ పథకం తీసుకున్నా అవినీతి కనిపిస్తోంది. నోరుంది కదాని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విపరీత వ్యాఖ్యలు,ఆరోపణలు జుగుప్స కలిగిస్తున్నాయి. ఇకపోతే కేంద్రంలో మోడీ ద్వయం రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని చేస్తున్న విన్యాసం చూపరులకు విసుగు తెప్పిస్తోంది. అయితే మోడీని ప్రశ్నించే ముందు తమ రాష్ట్రాల్లో తాము ఎంత సచ్చీలంగా పాలన చేస్తున్నామో ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు గమనించాలి.

### కేంద్రం దుర్మార్గాలను ఎండగట్టాలి..

ప్రజలు చేస్తున్నవిమర్శలకు సమాధానం చెప్పాలి. అలాగని కేంద్రం అధికార దుర్వినియోగాన్ని తప్పు పట్టకుండా ఉండలేం. కేంద్రం చేస్తున్న దుర్వినియోగాన్ని, దుర్మార్గాలను ఎండగట్టాల్సిందే. ఇకపోతే ఆదానీ కుంభకోణాలపై, మోసాలపై చలనం లేని బీజేపీ ప్రభుత్వం..సిసోడియా విషయంలో మాత్రం దూకుడు ప్రదర్శించింది. నిజానికి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు కేవలం కక్షసాధింపు వ్యవహారంగా కనిపిస్తోంది. ఎంతమంది అవినీతికి పాల్పడ్డారో వారందరినీ ఒకే గాటన కట్టి ఉంటే బాగుండేది. రాజకీయ అవినీతిని, కార్పొరేట్ మోసాలను అరికట్టే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ మోడీ మాత్రం విమర్శలను పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యాన్ని పట్టించు కోవడం లేదు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఎంతకాలం ఇలా ముందుకు వెళతారన్నది చూడాలి.

### విమర్శలను పట్టించుకోని మోడీ..

సీబీఐ, ఐటీ, ఈడి దాడులపై వస్తున్న ఆరోపణలను పట్టించుకోవడం లేదు. ఆయా రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి అధికారాన్ని చేజిక్కించు కుంటున్న తీరు కాంగ్రెస్ పాలన కన్నా దారుణంగా ఉంది. వ్యవస్థలను భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెస్ దయితే.. అంతకుమించిన దారుణాలను ఇప్పుడు మోడీ అనుసరిస్తున్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టే ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదు. ప్రజల సమస్యలను ప్రధానంగా పరిష్కరిస్తూనే.. అవినీతి నేతలను బొక్కలో తోయాల్సిందే. రాజ్యాంగ సంస్థలు అందరి విషయంలో సమన్యాయంతో వ్యవహరించాల్సిన బాధ్యత ఉంది. భారత ప్రజాస్వామ్యం పదికాలాలపాటు పటిష్టంగా నిలదొక్కుకోవాలంటే రాజ్యాంగ వ్యవస్థలు పటిష్టంగా పనిచేయాలి. నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవాలి. అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా ఉండరాదు. ఇది ఒక్క కేంద్రం విషయంలో మాత్రమే జరగడం లేదు. రాష్ట్రాల్లో నూ ఇలాగే వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. కేంద్రాన్ని విమర్శిస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే అవి రాజకీయ జోక్యంతో రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నాయి. అందుకే రాజ్యాంగ సంస్కరణలు రావాలని కొందరు మేధావులు కోరు కుంటున్నారు. ప్రధానంగా వివిధ దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం, ప్రణాళికా సంఘం అంటే నీతి ఆయోగ్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్జనరల్ వంటి అనేక సంస్థలు జవాబు దారీగా ఉండేలా పటిష్ట రాజ్యాంగం అవసరం.

### పాలకుల తీరు మారాలి..

దేశ సమాఖ్య విధానంలో సహకార స్ఫూర్తిని పెంపొందించాల్సిన కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగ సంస్థల పట్ల విశ్వసనీయత పెరగాలి. అవి తీసుకునే నిర్ణయాలు ఏకపక్షంగా ఉండకుండా చూసుకోవాలి. అందుకు దేశవ్యాప్తంగా చర్చచేయాలి. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని స్వారీ చేసే పాలకుల తీరు మారాలి. ఇలాంటి పాలకులు వస్తారని బహుశా రాజ్యాంగ రచన చేసిన వారు ఊహించ ఉండరు. అందువల్ల వ్యవస్థలను బలోపేతం చేస్తూ.. రాజకీయజోక్యం లేని పాలనా సంస్థలను రూపొందించుకోవాలి. కేంద్రంలో లేదా రాష్ట్రంలో అధికరాంలో ఉన్న పార్టీలు తమ అవసరాలకు వాటిని దుర్వినియోగం చేసే విధానాలకు చెక్ పెట్టాల్సిన అసవరం ఏర్పడింది.

### అవినీతి పాలనలపై చర్చించాలి..

ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పాలకులు వారిపైనే స్వారీ చేస్తారని గుర్తించాలి. ఇలా ప్రజలు నిద్రలో ఉన్నంత కాలం పాలకుల తమ విధానాలనే రుద్దుతారు. తాము చేసిందే కరెక్ట్ అని చెబుతారు. దీనిని అడ్డుకోవడం అన్నది ప్రజలు తమ కర్తవ్యంగా గుర్తించాలి. తాము అప్పగించిన అధికారం దుర్వినియోగం కాకుండా చూసుకోవాలి. ఎన్నికల వేళ ఇలాంటి అనర్థాలపై ప్రజలు చర్చించాలి. రాజ్యాంగ వ్యవస్థల పనితీరు, పాలకుల పనితీరు, అవినీతి పాలనలపై చర్చించాలి. ఎవరు అవినీతికి పాల్పడినా క్షమించరాదు. అందుకు అనుగుణంగా కార్యక్రమాలను ప్రజలే రచించాలి. మేధావులు కూడా మౌనంగా ఉండరాదు. రాజ్యాంగ పరిరక్షణతో పాలకుల అవినీతి, అక్రమాలపై మేధావులు గొంతెత్తాలి. నిరంతరం ప్రజలను జాగరూకత పర్చాలి. సెమినార్లు నిర్వహించాలి. చర్చాగోష్టులు చేయాలి. పాలకుల అవినీతి, అక్రమాలపై గొంతెత్తి నిలదీయాలి. అప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం బలపడుతుంది.

# వన దేవతల దీవెనలు అందరిపై ఉంటాయి

**జాతర నిర్వహణతో ఎంతో అనుభవం**

**మీడియా ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు**

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**వరంగల్ వాయిస్, ములుగు :** బండారుపల్లి గిరిజన భవన్ లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్ తో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మీడియా ప్రతినిధుల కృతజ్ఞత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతర కోసం ఈ ప్రాంత బిడ్డలుగా శ్రీ సమ్మక్క సారమ్మ వనదేవతల కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి తెలియజేసిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు, మీడియా ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. జాతర నిర్వహణ, నిరంతరం బయట ప్రపంచానికి తెలియజేసిన పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అమ్మవార్ల దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. మొదటిసారిగా జాతర నిర్ణయాధికారంతో నిర్వహించడం జరిగిందని, దీని ద్వారా ఎంతో అనుభవం వచ్చిందని తెలిపారు. జాతరలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయడం జరిగిందని ప్రతి ఒక్కరి అనుభవాల అనుసారం పుస్తక రూపంలో పొందుపరిచి లోపాలను పునరావృతం కాకుండా చూస్తామని అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు కాగానే మొట్టమొదటిసారిగా యుద్ధ ప్రాతిపాదికన పనులు ప్రారంభించడం జరిగిందని చెప్పారు. ఊహించిన దానికంటే భక్తుల సంఖ్య పెరిగిందని, అయినప్పటికీ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహించిన అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మీడియా ప్రతినిధులు జాతర విషయంలో ఎలాంటి అభివృద్ధి పనులు నిర్వహించాలో జాతరలో జరిగిన లోపాలను అనుభవాలను సూచనలను సలహాలను అందించాలని కోరారు. అందరి సూచనల సలహాల ప్రకారం మేడారం జాతరను మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు. జాతర నిర్వహణ త్రిసభ్య కమిటీ ( మంత్రి, కలెక్టర్, ఎస్పీ) మాదిరిగా నిర్వహించడం జరిగిందని అన్నారు. జాతర ముగిసిన అనంతరం వనదేవతలను వన ప్రవేశం చేసే సమయంలో చిరుజల్లులతో అమ్మవారి దీవెనలకు సంకేతంగా రావడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసిందని అమ్మవార్ల దీవెనలు అందరికీ ఉంటాయని అన్నారు. ములుగు కేంద్రంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి గిరిజన యూనివర్సిటీ తరగతులు జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్లు ప్రారంభించడం జరుగుతుందని, గోదావరి నది జనాలు రామప్ప సరస్సు నుంచి లక్నవరం సరస్సులోకి మళ్లించే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతర ముందు నుంచి జాతర ముగిసే వరకు మేడారం ప్రాంతం భక్తులతో



కళకళలాడిందన్నారు. అధికారుల అంచనాలకు మించి జాతరకు భక్తులు వచ్చారంటే జాతరపై మీడియా విస్తృత ప్రచారం చేయడంతోనే సాధ్యమైందన్నారు. జాతర విజయవంతంలో కీలకపాత్ర పోషించిన మీడియా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జాతర విజయవంతం అవడంలో మీడియా అత్యంత కీలక పాత్ర పోషించిందని అన్నారు. జాతర నిర్వహణలో నిరంతరం మంత్రి సహకారం అందించడం జరిగిందని వారు పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం పోలీస్ అధికారులు అర్థవంతంగా విధులు నిర్వర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం అదనపు ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ , దేవాదాయ శాఖ అధికారి రాజేందర్, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎండి రఫీక్, డీఎస్పీ రవీందర్, తాహాసీల్దార్ విజయభాస్కర్, రవీందర్, జిల్లా మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన సీపీ

**సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు**

**జిరాక్స్ సెంటర్ల మూసివేత**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కావడంతో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమిషనర్ పర్యవేక్షంచారు. పరీక్షలను పురస్కరించుకొని పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల పరిసరాలపై పోలీసులతో పాటు, ఇన్విజిలెటర్లు దృష్టి పెట్టాలని, సెక్షన్ 144 అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుంపులు ఉండకుండా జాగ్రత్త పడాలని అలాగే అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు. ముఖ్యంగా పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల పరిసరాలలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని, ముఖ్యంగా సీసీ కెమెరాల పనితీరుపై సంబంధిత పరీక్షా కేంద్రం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలో అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 19 పరీక్ష కేంద్రాలలో 9469 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో వారిని నిర్వాహకులు అనుమతించ లేదు. ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3329 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1231 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3685 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1224 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగును. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో పరీక్షా కేంద్రాలకు గంట ముందే విద్యార్థులను అనుమతించనున్నారు. ప్యాడ్లు, హాల్ టికెట్లు, పెన్నులు, పెన్సిల్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావద్దని అధికారులు హెచ్చరించారు. 19 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఇద్దరు కస్టోడియన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు 120 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా నీడలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల సౌకర్యాల పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించారు. ప్రతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

## సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్టార్ హరికోట్ల రవి అన్నారు. సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆర్టీఐ ఆధ్వర్యంలో మార్చి నెలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు పోస్టర్ ను హరికోట్ల రవి ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు, సామాన్యుడికి ఏ ఆఫీసుకు వెళ్లిన పని చేయించుకోవడం తనకు కావలసిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 12 అక్టోబర్ 2005 తేదీన ఈ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. దీనిని ఉపయోగించుకొని ప్రభుత్వ పనులపై సమాచారాన్ని పొందవచ్చు. ప్రభుత్వ పాలనా వ్యవస్థలో ప్రతి భారత పౌరుడు సామాజిక బాధ్యతగా అవినీతి అక్రమాలను నిరోధించడానికి పేద ప్రజలకు ఆర్టీఐ ఆవశ్యకత ఎంతో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్రవంతి, అక్కెల్లి పవన్ కళ్యాణ్, మంద ప్రవీణ్, కాషిపాక సుష్మిత, సురేష్, మనోజ్, అరుణ్ కుమార్, సిలువేరు సురేష్ పాల్గొన్నారు.

## బల్దియాలో రెవెన్యూ సమస్యల మేళా

### పన్నుల సంబంధ సమస్యలపై 9 దరఖాస్తుల స్వీకరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బల్దియాలో నిర్వహించిన పన్నుల (రెవెన్యూ) సమస్యల పరిష్కార మేళాలో కాశీబుగ్గ సర్కిల్ పరిధికి సంబంధించి 05, కాజీపేట సర్కిల్ పరిధినకు సంబంధించిన 04 దరఖాస్తులు మొత్తం 09 దరఖాస్తులు స్వీకరించినట్లు అదనపు కమీషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. ప్రతి బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పన్నుల(టాక్స్) మేళా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో నూతన ఇంటి నిర్మాణం ఇంటి పన్ను, ఇంటి పన్ను సవరణ, ఇంటి యజమాని పేరు సవరణ, ఇంటి నెంబర్ సవరణ, ఖాళీ స్థలానికి పన్ను విధింపు, ఖాళీ స్థలం పన్ను నుంచి ఇంటి పన్ను మార్పు తదితర సమస్యలపై దరఖాస్తు సమర్పిస్తే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా అదనపు కమిషనర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ అనిల్, సీనియర్ అసిస్టెంట్ ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ స్కీం అమలులో నిబంధనలు సడలించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలలో ఒకటైన రూ.500లకే గ్యాస్ సిలిండర్ గ్యారెంటీ అమలులో ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సడలించాలని ప్రభుత్వానికి ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునాహరి శేషు విజ్ఞప్తి చేశారు. మహిళ పేరుపైన గ్యాస్ కనెక్షన్ ఉండాలనే నిబంధన పెట్టడం వలన లక్షలాది మంది ఈ గ్యారెంటీ ద్వారా లబ్ధి పొందలేకపోతున్నారు. కాబట్టి, ఈ నిబంధన ఎత్తివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నిబంధన వలన గ్యారెంటీ లక్ష్యాలు, ఉద్దేశాలు దెబ్బతింటున్నాయని. కాబట్టి, ఈ నిబంధన ఎత్తివేయాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక కోటి 24 లక్షల ఎల్ పీజీ గ్యాస్ కనెక్షన్లు ఉంటే ఈ గ్యారెంటీ ద్వారా కేవలం 40 లక్షల మంది మాత్రమే లబ్ధి పొందబోతున్నారు. కాబట్టి, గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరు పైన ఉన్నా ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఈ గ్యారెంటీ వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, నరేందర్ పాల్గొన్నారు.

## మార్చి 9న జాతీయ లోక్ అదాలత్



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 09న నిర్వహించబడే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఉద్దేశించి, ములుగు బార్ అసోసియేషన్ మెంబర్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ములుగు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పీవీపీ లలిత శివజ్యోతి మాట్లాడుతూ "జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల సూచనల మేరకు ములుగు జిల్లా వ్యాప్తంగా నిర్వహించబడే జాతీయ లోక్ అదాలత్ లో అత్యధిక కేసుల పరిష్కారానికి బార్ అసోసియేషన్ మెంబర్స్ ములుగు, పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులు సహకరించాలని తెలిపారు. రాజీ పడదగు కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారిని ఎటువంటి ఒత్తిడిలకు గురి చేయకుండా రాజీమార్గం ద్వారా వారి కేసును పరిష్కరించుకునేలా అందరూ సహాయపడాలని తెలియజేశారు. లోక్ అదాలత్ పట్ల ఎటువంటి న్యాయ సలహా సూచనల కొరకు అయిననూ న్యాయ సేవా అధికార సంస్థలను ఆశ్రయించి, న్యాయ సలహాలు, సూచనలను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి టి.మాధవి, డి. రామ మోహన్ రెడ్డి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ములుగు, ములుగు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్. వేణుగోపాల చారి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మేకల మహేందర్, న్యాయవాదులు యం. వినయ్ కుమార్, యం వెంకటేశ్వర్ రావు, ఆర్. భిక్షపతి, కె. సునీల్ కుమార్, బి. శ్యామ్ ప్రసాద్, బి.స్వామి దాస్, డి. రామ్ సింగ్, ఆర్. రాజకుమార్, ఎన్. రవీందర్ ఎస్ డీపీఓ, ములుగు, ఎన్. సుభాష్ బాబు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ( డీసీఆర్ బీ)ఎమ్. రంజిత్ కుమార్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ములుగు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు, పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ పై దాడిని ఖండిస్తున్నాం

### బీజేపీ నేత పెసరు విజయ చందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ చేపట్టిన ప్రజాహిత యాత్రపై కాంగ్రెస్ శ్రేణులు చేసిన దాడిని హుజూరాబాద్ ప్రభారి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పెసరు విజయ చందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో బీజేపీకి, మోడీకి పెరుగుతున్న ఆదరణను, ముఖ్యంగా బండి సంజయ్ కి ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చూసి ఓర్వలేక కాంగ్రెస్ కిరాయి గుండాలు, మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచరులు అప్రజాస్వామికంగా చేసిన దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి దాడులే పునరావృతం అయితే ప్రతి దాడులు తప్పవని, కాంగ్రెస్ శ్రేణులకు ముఖ్యంగా పొన్నం ప్రభాకర్ అనుచరులను హెచ్చరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బండి సంజయ్ గెలుపే లక్ష్యంగా ప్రతి భారతీయ జనతా పార్టీ కార్యకర్త ప్రజా యాత్రలో పాల్గొని కరీంనగర్ పార్లమెంట్ స్థానాన్ని గెలిపించుకొని నరేంద్ర మోడీకి కానుకగా ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారి మురళీధర్ గౌడ్, పరకాల కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, ఆర్సీ జయంత్ లాల్, పూర్ణాచారి, మేఘనాథ్, మార్త రాజభద్రయ్య, గురుజాల శ్రీరామ్, ముత్యాల శ్రీనివాస్, ఎర్రం రామన్న, కంది క్రాంతి కుమార్, పగడాల రాజకుమార్, రాధారపు శివకుమార్ ముల్క ప్రసాద్, గాజుల నిరంజన్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా వెలుగు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు

### కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇంటింటా వెలుగు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మానుకోట జిల్లా కాంగ్రెస్ నాయకుడు మేనకా శంతన్ రామరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రెండు సంక్షేమ పథకాల పట్ల హర్షం వెలిబుచ్చుతూ సంబరాలు నిర్వహించారు. పెద్దవత్తున మహిళలు పాల్గొని కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈసందర్భంగా మేనకాశంతన్ రామరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా బుధవారం గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈపథకాల ద్వారా ఆర్థికంగా కుదేలైన ఎన్నో నిరుపేద కుటుంబాల్లో వెలుగు నిండాయన్నారు. రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, ఐదొందలకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడం సాహసోపేత నిర్ణయమని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురైన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో సుపరిపాలన సాగిస్తోందని కొనియాడారు. ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులున్నా ఆరు గ్యారంటీలకు అత్యధిక నిధులు కేటాయించి ప్రభుత్వం ప్రజలపట్ల తన చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అదేవిధంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ఉద్యోగ కల్పనతో అందరికీ ఉపాధినందిస్తుందని చెప్పారు. రాబోయే పట్టభద్రుల, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ దుందుభి మోగించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో షేక్ మహబూబీ, భారతమ్మ , గుండోజు ఉమ, తిరోత్తమాల విజయలక్ష్మి, కొలువుల కోమల, రూప, షబాన, వినోద, కుందోజు లక్ష్మి, సుగుణమ్మ, జ్యోతి, పద్మ, దుర్గ, రాధిక, నాజు, ఆసియా, కౌసల్య, వంగాల సోమనర్సయ్య చారి, లింగోజు వేణు, గుండోజు కృష్ణమూర్తి, ఉపేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

## ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంచార్జి రాములు



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంచార్జి సీహెచ్ రాములు అన్నారు. ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని హరిపిరాలలోని రావుల రాఘవేందర్ రెడ్డి ఆయిల్ పామ్ తోటలో పంట సాగు మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగులో ఎరువుల, నీటి యాజమాన్యం, వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ... దేశంలో అయిల్ పామ్‌కు ఎక్కవ డిమాండ్ ఉన్నందున విదేశాల నుంచి ఈ వంట నూనెను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ విస్తరణకు ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయిల్‌పామ్ సాగులో చీడపీడలు, వర్షాలు, కోతులు, అడవి పందులు, గాలివానలతో ఎలాంటి నష్టం ఉండదన్నారు. అలాగే ఆయిల్ పామ్ తోటలో అంతర్ పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు పండించిన వీటి గెలల విక్రయాల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. తొర్రూరు శివారు గోపాలగిరి గ్రామంలో పరిశ్రమ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఫ్యాక్టరీ వరకు పంట రవాణా ఖర్చులను పూర్తిగా టీఎస్ ఆయిల్‌ఫెడ్ భరిస్తుందని తెలిపారు. రైతులు సాంప్రదాయ పంటల స్థానంలో అధిక లాభాలను ఇచ్చే ఆయిల్ ఫామ్ పంట సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ జిల్లా కోఆర్డినేటర్ రంజిత్, రైతులు రావుల నరసింహారెడ్డి , జగదీష్ చందర్ రెడ్డి , కడుదుల రాజేష్ , నర్సమ్మ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్యలు రావొద్దు

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణ రావు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశాని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాలల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుని, ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. వచ్చే ఖరీఫ్ నాటికి జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న చెరువులు, కుంటలు మరమ్మత్తులు చేసి రైతులకు సాగు నీటి సమస్య రాకుండా చూడాలన్న ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమీక్షా సమావేశానికి ముందు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 37మంది కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి భా పూలే పాఠశాలలో నిర్వహించిన సైన్స్ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ గా ఎన్నికైన అజ్మతుల్లా హుస్సేన్ ని వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, పర్వతగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ లు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్, రాజు పాల్గొన్నారు.

# స్టేట్ సరే సెంట్రల్‌లో కాంగ్రెస్ రాద్దు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** అబద్దాల పునాదుల మీద గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి సహజ నైజం బయటపడిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని బీజేపీ నాయకుడు గుజ్జల ప్రేమేందర్ రెడ్డి విమర్శించారు. బుధవారం డోర్నకల్ నియోజకవర్గం కేంద్రంతో పాటు మరిపెడ మండల కేంద్రంలో జరిగిన భారత్ సంకల్ప యాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచినప్పటికీ కేంద్రంలో గెలిచే అవకాశాలు లేవని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో 412 హామీలు ఇచ్చిందని ఏ ఒక్క హామీ ఇప్పటి వరకు అమలు చేయడం లేదని ఆరోపించారు. డిసెంబర్ 9న 2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. మహిళలకు రూ.2500 , నిరుద్యోగ భృతి, రూ.4000 పెన్షన్ చొప్పున ప్రకటించి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి గురించి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తే అసలు హామినే ఇవ్వలేదని భట్టి విక్రమార్క అబద్ధం చెప్పారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడానికి రూ.3.50 లక్షల కోట్లు నుంచి 5 లక్షల కోట్ల వరకు ఖర్చవుతుందని, కానీ బడ్జెట్లో రూ.53 వేల కోట్లు మాత్రమే ప్రవేశపెట్టారన్నారు. జిల్లా ఆధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మార్తినేని ధర్మరావు, విజయరామ రావు, యాప సీతయ్య, భూక్య లక్ష్మణ్, సంగీత, బాలు నాయక్, సునీల్ పాట్నీ, సత్యనారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సాఆర్




**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని లిభూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం శాయంపేట మండలంలోని ఆరెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామ కూడలిలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని అన్నారు. అదేవిధంగా, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు విద్యుత్ సౌకర్యం, రూ.500 వందలకే వంట గ్యాస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు లేని ప్రతీ ఒక్కరికీ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలిస్తామని వెల్లడించారు. అన్నిగ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, గత పాలకుల కంటే భిన్నంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# పిల్లకు పోలియో చుక్కలు వేయించాలి

## ఎంపీపీ రాణీబాయి రామారావు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో మార్చి 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఎంపీపీ బి.రాణీబాయి రామారావు అన్నారు. మండలంలో 0-5 సంవత్సరాల వయస్సున్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. మార్చి 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమ ఏర్పాట్లపై బుధవారం మండల పరిషత్ సమావేశపు మందిరంలో వైద్య, విద్యా, సంక్షేమశాఖలు, గ్రామీణాభివృద్ధి అనుబంధ శాఖల అధికారులతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుస్మిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాణీబాయి రామారావు మాట్లాడుతూ మండలంలో 2144 మంది 0-5 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించడం జరిగిందని చెప్పారు. మార్చి 3, 4, 5 తేదీలలో వీరందరికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల(సబ్ సెంటర్లు) పరిధిలోను, రూరల్ ప్రాంతాల్లో, ట్రైబల్ ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో కేంద్రాలు, మొబైల్ పాయింట్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వీటితో పాటు బస్‌స్టాండ్, కాళేశ్వరం ఆలయం వద్ద, జనసమూహాలతో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ప్రత్యేక శిభిరాలు ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయనున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. మార్చి 3న జరిగే ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో ఏదేని కారణాలతో మిగిలిపోయిన చిన్నారులకు మరుసటి రోజు ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలను వేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, డాక్టర్ సుస్మిత, అంగన్ వాడీ సూపర్ వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేదల ఇంటికి పెద్దన్న అల్లం బాలకిషోర్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన నాంపల్లి రమేష్ (ఏ/ఎస్ రాజు) అనే ఆటో డ్రైవర్ గత ఏడాది రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు మూడు సార్లు సర్జరీ జరిగి, ఏ పని చేయలేక వైద్య చికిత్స ఖర్చులకు, కుటుంబ పోషణకు, తన కూతురును చదివించడానికి చాలా ఆర్థిక యిబ్బందులు పడుతున్నారు. అతడి దయనీయ పరిస్థితిని, ఇంట్లో ఆర్థిక పరిస్థితిని చూసి చలించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, పేదల దేవుడు ప్రముఖ సామాజిక సేవకులు అల్లం బాలకిషోర్ రెడ్డి మానవత్వంతో స్పందించి బాధితుడికి రూ. 20వేలు ఆర్థిక సాయాన్ని అందించి, తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. ఈ సహాయ కార్యక్రమంలో మర్రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు సాయిలి ప్రభాకర్, కొమ్ము శ్రీకాంత్, మర్రి క్రాంతి, గ్రామ అధ్యక్షులు కందికొండ రాజు, వరిగల రాజు, కులమల్ల అనిల్, తుప్పరి ఉదయ్, పవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్యాడ్స్, పెన్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మాధవ స్మారక సమితి, వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, పౌచులు బహుకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గత సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో జిల్లాలో ప్రథమ స్థాయిలో నిలిచిన బి.వైశాలి అనే విద్యార్థినికి రూ.5001 నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.జగన్, స్టాఫ్ సెక్రటరీ గుజ్జ వెంకటేశం, మాధవ స్మారక సమితి ప్రతినిధులు డాక్టర్ సుధాకర్ రావు, అలువాల బిక్షపతి, దాస్యం రామానుజం, పోల్సాని శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి మల్లారెడ్డి, లెక్కల జలంధర్ రెడ్డి, రాచకట్ల లక్ష్మణ్ సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** మార్చి 1న జరిగే బండి సంజయ్ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ ముఖ్య నాయకులు కోరారు. 62వ డివిజన్ లో బుధవారం ఉదయం రహమత్ నగర్ లో 62వ డివిజన్ ఇంచార్జి వలపదాసు రామ్ మనోహర్ రావు, రావు అమరేందర్ రెడ్డి విజయ సంకల్పయాత్ర సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కోవెల జీవన్ ప్రకాష్, 62వ డివిజన్ అధ్యక్షుడు భగవాన్ దాస్ ఉపాధ్యాయ, మేకల శ్రావణ్, సుంచు విజయ్, కురుమయ్య, హరి వ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో కనిపించని సామాజిక న్యాయం

### చింతకింది కృష్ణమూర్తి నేత



**వరంగల్ వాయిస్, జనగామ :** మార్చి 2న హైద్రాబాద్‌లో బీసీ, అణగారిన వర్గాల ఆత్మగౌరవ సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని జనగామ జిల్లా బీసీ రాజ్యాధికార సమితి ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి నేత తెలిపారు. ప్రస్తుత రాజకీయాల్లో సామాజిక న్యాయం క్రమంగా కనుమరుగవుతున్నదనీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు ఆర్థికంగా బలంగా లేకపోవడంతో రాజకీయాల్లో అవకాశాలకు ఆమడ దూరంలో నెట్టివేయబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం వివిధ పార్టీల విధానాల్లో, మేనిఫెస్టోలలో ప్రచురితమవుతున్నా దానిని అమలు విషయంలో మాత్రం పార్టీలకు చిత్తశుద్ధి కరువవుతుందని పేర్కొన్నారు. ఈ దరిమిలా బీసీ అణగారిన వర్గాల "ఆత్మగౌరవ సదస్సును" మార్చి 2 శనివారం ఉదయం 10 గంటల నుంచి సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వేదికగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీల బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రతినిధులు, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, న్యాయ వ్యవస్థలోని ప్రముఖులు, జర్నలిస్టులు విద్యార్థి, ఉద్యమ ,కార్మిక మహిళా నాయకులు, వివిధ కులసంఘాల నాయకులు ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలను వెలుబుచ్చనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుంచిపెద్ద ఎత్తున బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు నేతృత్వం వహించనున్నారని అయన పేర్కొన్నారు

## వక్ఫ్ బోర్డ్ భూములు ఆక్రమించారని ఫిర్యాదు

### సర్వే చేపట్టిన ఆధికారులు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ పట్టణ పరిధిలోని ముస్లీం కబరస్తాన్ భూములు ఆక్రమణకు గురయ్యాయని భాజపా నాయకుడు సత్యనారాయణ, ముస్లిం మైనార్టీ నాయకులు సైయద్ బాకర్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ భూములపై సర్వే నిర్వహించి రిపోర్ట్ ఇవ్వాలని మండల భూ సర్వేయర్ ను ఆదేశించిగా సర్వే నంబర్ 03 (లక్ష్మి టాకీస్ సమీప స్థలం) 05 (జగదాంబ రైస్ మిల్ సమీప స్థలం),135,136,137 (కబరస్తాన్ ఎదుట స్థలం) భూములపై బుధవారం సర్వే నిర్వహించారు. సుమారు 4.37 ఎకరాల భూమి ఆక్రమణకు గురైయిందని పై వ్యక్తులు చేసిన ఫిర్యాదు మేరకు జరిగిన ఈ సర్వే రిపోర్ట్ ను జిల్లా కలెక్టర్కు సమర్పిస్తామని సర్వేయర్లు తెలిపారు. వక్ఫ్ బోర్డ్ జిల్లా అధికారులతో స్థానిక ముస్లీంలు పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ సైన్స్ డే



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని విశ్వ జెనిత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నేషనల్ సైన్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి పర్వతగిరి ఎంపీటీసీ మాడుగుల రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులు తయారుచేసిన ఎగ్జిబిట్లను ఆసక్తిగా పరిశీలించి, ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. సైన్స్ డేలో విద్యార్థులు 40కి పైగా ఎగ్జిబిట్లు తయారుచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎర్రబెల్లి హరికుమార్ మాట్లాడుతూ సర్ సి.వి.రామన్ చేసిన రామన్ ఎఫెక్ట్ ఫలితంగా నేడు మనం సైన్స్ డే ను జరుపుకుంటున్నామని, మనిషి జీవన విధానం సైన్స్ తో ముడిపడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులు, పాల్గొన్నారు.

# అవార్డులు బాధ్యతలను పెంచుతాయి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అవార్డులు పురస్కారాలు నాయకత్వ పురోభివృద్ధికి ప్రోత్సాహకాలు అలాగే బాధ్యతలను పెంచుతాయని లయన్స్ ప్రముఖులు గ్లోబల్ యాక్షన్ టీం ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్జీ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్ రావు, మాజీ చైర్మెన్ ఎం.విద్యాసాగర్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి హనుమకొండ న్యూ శాయంపేటలోని లయన్స్ భవన్ లో జరిగిన ఇంటర్నేషనల్ ఎక్స్ లెన్స్ అవార్డుల ప్రధానోత్సవంలో వారు గౌరవ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. 320ఎఫ్ జిల్లా తక్షణ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్నా పరశురాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గత లయన్స్ సంవత్సరం 2022-23లో క్లబ్ స్థాయిలో, ప్రాంతీయ స్థాయిలో జోనల్ స్థాయిలో, జిల్లా స్థాయిలో వివిధ విభాగాలలో పనిచేసి విజేతలైన పలువురికి ఇంటర్నేషనల్ ఎక్స్ లెన్స్ అవార్డులు లభించాయి. వాటిని మంగళవారం సభ్యులకు ప్రదానం చేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మిషన్ 1.5 మెంబర్షిప్ గ్రోత్ లక్ష్య సాధనలో అవార్డు గ్రహీతలందరూ కృషి చేయాలని కోరారు. వరంగల్ ప్రాంతంలో సేవలందిస్తున్న ఈ జిల్లా నాయకుల ప్రతిభ పాటవాలను అభినందిస్తూ వారు కొనియాడారు. తక్షణ పూర్వ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు నేతృత్వంలో వారి టీం సాధించిన ఈ విజయం భవిష్యత్తు నాయకులు కొనసాగించాలని అతితులు ఆకాంక్షించారు. తొలుత స్వగతం తెలిపిన కన్నా పరశు రాములు మాట్లాడుతూ తన టీం సభ్యుల సహకారంతో మెంబర్ షిప్ గ్రోత్ సాధనలో లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కు నిధులు సమకూర్చుటలో లక్ష్యాలను సాధించి చరిత్ర సృష్టించామన్నారు. జిల్లాలో 86 శాతం క్లబ్ ల అధ్యక్షులు, 100శాతం రీజియన్ చైర్మన్, జోన్ చైర్మన్లకు, జిల్లాలో మరికొంతమందితో పాటు జిల్లా గవర్నర్ కు ఇంటర్నేషనల్ ఎక్స్ లెన్స్ అవార్డులు లభించాయని తెలిపారు. లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా పని చేసి విజయాలు సాధించిన కన్నా టీం సభ్యులు అభినందనీయులని ఈ జిల్లాకు కు చెందిన పూర్వ జిల్లా గవర్నర్ లు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఈ జిల్లాలో సంస్థ విస్తరణకు కృషి చేసిన పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కందాళ గోవింద్ రాజ్ ను జీవన సాఫల్య పురస్కారంతో ఘనంగా సన్మానించారు. స్పందించిన గోవింద్ రాజ్ గతస్మృతులను గుర్తు చేస్తూ ప్రస్తుత టీమ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత జిల్లా గవర్నర్ ఎన్. వెంకటేశ్వర రావు, వైస్ జిల్లా గవర్నర్ డా. కె. చంద్రశేఖర్ ఆర్యా, పూర్వ జిల్లా గవర్నర్ లు డాక్టర్ డి. లవకుమార్ రెడ్డి, ప్రొఫెసర్ వి. గోపాల్ రెడ్డి, ముచ్చ రాజిరెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహారావు, పొట్లపల్లి శ్రీనివాసరావు, కొత్తపల్లి జాన్ బన్నీ, డాక్టర్ కొండపల్లి సుధాకర్ రెడ్డి, సెక్రటేరియట్ టీం సభ్యులు నాగబండి రవీందర్, అల్లాడి ప్రభాకర్ రావు, చంద్రగిరి ప్రసాద్, కుర్రేముల యాదగిరి, కృష్ణ జీవన్ బజాజ్, అవార్డు గ్రహీతలైన రీజియన్ చైర్మన్లు డి.వేంకటేశ్వర్లు, డా. గంగిశెట్టి ప్రమోద్ కుమార్, రేగూరి వెంకన్న, కె. రాంగోపాల్ రెడ్డి, డి. వెంకటస్వామి, ఉషా మార్త, డా. బి. లక్ష్మీనారాయణ, వనం గోపాల్ రావు, గ్యాట్ టీం సభ్యులు డా అజిత్ కుమార్, పి. హరికిషన్ రెడ్డి, ఎన్.సుధాకర్ రెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, త్రివేణి రెడ్డి, మార్కాల యాదిరెడ్డి, మార్గం ప్రభాకర్, పెద్ది వెంకట నారాయణ గౌడ్, కే.రాజమౌళి పాల్గొన్నారు. జిల్లా పీఆర్ఓ పెండెం వేణుమాధవ్ రావు కార్యక్రమం వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## సేంద్రీయ సేద్యంతో ఆర్థిక అభివృద్ధి

### జాతీయ సదస్సు ముగింపులో

### యూజీసీ చైర్మన్ ప్రొ.మల్లికార్జున్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** మానవ మనగడ అభివృద్ధి చెందాలంటే నిలకడ ఆర్థిక వృద్ధి కీలకమని యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం "వ్యాపార, వాణిజ్య విభాగంలో 'లివరేజింగ్ సస్టైనబుల్ ఫైనాన్స్ ఫర్ ఎకనామిక్ డెవలప్మెంట్- ఎమర్జింగ్ చాలెంజెస్ అండ్ సొల్యూషన్స్" అనే అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సేంద్రియ సేద్యం, ధ్వని ఆహార కాలుష్య రహిత సమాజం, వ్యవసాయంలో తక్కువ ఎరువుల వాడకం, ఎక్కువ దిగుబడిని పొందడం, పర్యావరణం రక్షించే పద్ధతుల ద్వారా సుస్థిర ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ జాతీయ సెమినార్ ను నిర్వహిస్తున్న సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ ఉపన్యసిస్తూ ఈ సదస్సుకు 70 వివిధ అంశాలపై వ్యాసాలు రావడం జరిగిందని తెలియజేశారు. ఈ సెమినార్ ముఖ్య ఉద్దేశం నెరవేరిందని వక్తలందరూ సుస్థిర ఆర్థిక అభివృద్ధికి ఎంతో విలువైన సూచనలు చేశారన్నారు. సీనియర్ ప్రొఫెసర్ వరలక్ష్మి మాట్లాడుతూ బ్యాంకులు రుణం ఇచ్చే సమయంలో ప్రకృతిని కాపాడి పర్యావరణ పరిరక్షించే విధంగా ఉండే పెట్టుబడులు మాత్రమే ప్రోత్సహించాలని సూచించారు. సెమినార్ అధ్యక్షులు ప్రొఫెసర్ అమరవేణి మాట్లాడుతూ సూర్యరష్మితో, గాలి మరల ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్తు సంస్థలను ప్రోత్సహించి ప్రకృతి వైపరీత్యాలను అరికట్టినప్పుడు మాత్రమే సుస్థిరమైన ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుంది తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ప్రొఫెసర్ రాజిరెడ్డి, ప్రొఫెసర్ కృష్ణమాచారి, డాక్టర్ నిరంజన్, డాక్టర్ రవీందర్, డాక్టర్ స్వామి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ కనకయ్య, డాక్టర్ రాజు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సునీత, డాక్టర్ సాయి శరణ్,డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ ఫణి, డాక్టర్ ప్రగతి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సురేష్, డాక్టర్ మయూరి, డాక్టర్ నరేందర్, డాక్టర్ గిరి, డాక్టర్ సరిత, రమేష్, వీరన్న, హరిత, రవిబాబు, సోమశేఖర్, డాక్టర్ వీణ, డాక్టర్ సుమలత మరియు రీసెర్చ్ స్కాలర్స్ రాజేందర్, హరికృష్ణ, విద్యార్థి విద్యార్థినిలు పాల్గొన్నారు.

## జన్ను గణేష్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ ఖిలా వరంగల్ మండల పార్టీ అధ్యక్షుడిగా జన్ను గణేష్ ను కాంగ్రెస్ పార్టీ నియమించింది. గణేష్ నూతనంగా భాద్యతలు స్వీకరించిన సందర్భంగా మండల, నియోజకవర్గ, వరంగల్ మున్సిపాలిటీ పరిధిలో పలువులు నాయకులు, కార్యకర్తలు, శాలువా, పూల బోకేతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో పేరుకుపోయిన పలు సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిందిగా, అర్హులైన లబ్ధదారులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని కోరారు. అందరికి అందుబాటులో ఉంటూ ఖిలా వరంగల్ మండలంను ప్రథమ స్థానంలో ఉంచాలని విన్నవించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు జన్ను గణేష్ మాట్లాడుతూ ఇక నుంచి కార్యకర్తల కష్ట, సుఖాలలో తోడుగా ఉంటూ రాబోయే పార్లమెంట్, మున్సిపాలిటీ ఎన్నికలో గెలుపే లక్ష్యంగా మనమందరం కలిసి పని చేసి పార్టీని మరింత బలోపేతం చేద్దామని అన్నారు. ఎన్నిక ఏదైనా విజయం కాంగ్రెస్ పార్టీదే అని, విజయం దిశగా అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. సహకరించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు జన్ను గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రానికి చెందిన తోర్నే అనిల్- కవితల ప్రథమ పుత్రిక రేష్మ-ఓంకార్ ల వివాహానికి హాజరై నూతన వధూవరులను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఆశీర్వదించారు. ఆయన వెంట ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే శివాజీ, ఉపాధ్యక్షుడు కొల్లూరి కండేరావు, ముఖ్య సలహాదారులు పేర్వాల లింగమూర్తి, నడికూడ మండల అధ్యక్షులు లోకటి నగేశ్, సీనియర్ నాయకులు వాంకే రాజయ్య, మోకిడే రాజు, తోర్నే శ్రీకాంత్, గోరి కొత్తపల్లి మండల నాయకులు రగుసాల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కడియం ఫైర్

## చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చేవెళ్ల సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్ అయ్యారు. హనుమకొండలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కడియం మాట్లాడుతూ కేటీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి మాటలు జిగుప్సాకరంగా ఉన్నాయన్నారు. ఒక ముఖ్యమంత్రిని అనే సోయి మరచి మాట్లాడుతున్నాడని, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయలేకనే ప్రతిపక్షాలపై దాడి చేస్తున్నారని అన్నారు. మగాడివి అయితే ఒక్క ఎంపీ సీటు గెలువు అని ఒక ముఖ్యమంత్రి మాట్లాడటం సిగ్గుచేటని, మల్కాజిగిరి ఎంపీగా ఉన్న నువ్వు 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఒక్క సీటు కూడా ఎందుకు గెలిపించుకోలేదని ప్రశ్నించారు. రాజకీయాలలో మగతనం గురించి మాట్లాడుతున్నావంటే మీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీని, ప్రియాంక గాంధీని అవమానించినట్లేనా అని ప్రశ్నించారు. ఇదేనా నువ్వు నేర్చుకున్న సభ్యతా సంస్కారం అన్నారు. తెలంగాణలోని 17ఎంపీ స్థానాలను గెలుచుకొని నీ మగతనం ఏంటో నిరూపించుకో అని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సీఎం కుర్చీ ఈనాం కింద రాలేదు, వారసత్వంగా రాలేదు అంటున్నాడని, కచ్చితంగా సీఎం కుర్చీ నీకు ఇనాం కిందనే వచ్చిందన్నారు. కుటుంబ రాజకీయాలను ప్రోత్సాహించింది కాంగ్రెస్ పార్టీ కాదా....? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ రాజకీయాలపై మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారని, ఇప్పటికీ కూడా ఇందిరా గాంధీ పేరు చెప్పంది మీకు పూట గడవదని, కాంగ్రెస్ పేరుకే జాతీయ పార్టీ.... నిజానికి ప్రాంతీయ పార్టీ అన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రిగా కాకుండా తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రిగా వ్యవహారించాలని హితవు పలికారు. గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని చెప్పారు. కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదని, కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ లబ్ది కోసమే కాళేశ్వరాన్ని వాడుకుంటున్నదన్నారు. కాళేశ్వరంపై నిపుణుల కమిటీతో విచారణ జరిపి బాధ్యులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలన్నారు. మేడిగడ్డను రిపేర్ చేయకుండా మొత్తం కొట్టుకుపోవాలనే దుర్మార్గపు ఆలోచనలో ఉన్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు, నీచ రాజకీయాలు మానుకోవాలని, ముఖ్యమంత్రి బాషను సవరించుకొని జాగ్రత్తగా మాట్లాడటం నేర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా ఎంపీ పసునూరి దయాకర్, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయండి

### బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో పోల్స్ పోలియో నిర్వహణ, ఏర్పాట్లపై ఆరోగ్య అధికారులు బల్దియా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కమీషనర్, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు హాజరై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంచేయాల్సిన అవసరం ఉందని, మార్చి 3న నిర్వహించే కార్యక్రమంలో బల్దియా వ్యాప్తంగా ఉన్న 0–5 ఏళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో వాక్సినేషన్ జరిగేలా చూడాలన్నారు. ఇందుకోసం వివిధ ప్రచార మాధ్యమాలు, స్వచ్ఛ ఆటోల ద్వారా విస్తృత ప్రచారం చేయించాలని ఆదేశించారు. అంతకు ముందు ఆరోగ్య శాఖ ఉన్నతాదికారులు పల్స్ పోలియో నిర్వహణ ఏర్పాట్లపై వివరణ ఇస్తూ 0–5 ఏళ్లలోపు చిన్నారులు 36101 మంది ఉన్నారని వారికి 159 బూత్ లలో, 9 ప్రజారవాణా జరిగే ప్రాంతాల్లో, 10 మొబైల్ బృందాల ద్వారా 636 మంది వాక్సినేటర్లు 16 రూట్ లలో 47 హై రిస్క్ ప్రాంతాలైన ఇటుక బట్టిలో పనిచేస్తున్న వారి పిల్లలు, సంచార జాతుల పిల్లలకు కూడా వాక్సినేషన్ చేస్తారని తలిపారు. వరంగల్ నగరంలోని 8 యూపీఎస్ లలో 8352 మంది చిన్నారులు ఉన్నారని, ఇందులో 3521 మంది పిల్లలు హై రిస్క్ ప్రాంతాల్లో ఉన్నారని, హనుమకొండ ప్రాంతం లో 136 పోలియో బూత్ లు ఏర్పాటు చేసి వాక్సినేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డా రాజేష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.గోపాల్ రావు, సర్వేలేన్స్ మెడికల్ ఆఫీసర్ డా.ప్రశాంత్, వరంగల్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ప్రకాష్, హనుమకొండ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.వాణి శ్రీ, టీపీఆర్ఓ కోలా రాజేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** జిల్లా స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టరల్ పార్టీసిపేషన్ ప్రోగ్రాం) ఆధ్వర్యంలో యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ బుధవారం నర్సంపేట బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన భారీ ర్యాలీని స్వీప్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నోడల్ అధికారి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండి ఓటు హక్కు నమోదు చేసుకున్న యువత ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఈవీఎం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధానం పట్ల యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఓటరు చైతన్య రథాలను ఏర్పాటు చేసి అవగాహన కలిగిస్తునామని, ఉత్తమ ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు ప్రముఖ పాత్ర వహిస్తుందని, ఓటు హక్కు వినియోగాన్ని బాధ్యత గా భావించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారి సారయ్య, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కోర్టు కేసులే కాదు జైలుకు వెళ్లడానికి సిద్ధం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా న్యాయస్థానంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టడంతో బుధవారం డాక్టర్ న్యాయస్థానానికి హాజరు కావడం జరిగిందని వరంగల్ ఎంపీ సీటు ఆశవహుడు పెరుమండ్ల రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ ఎస్ ప్రభుత్వం అక్కసుతో ఎన్ని కేసులు పెట్టినా, ఒక్క రోజు కూడా భయ పడకుండా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై, నిరంకుశ కేసీఆర్ పాలన పైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేశారన్నారు. ఆ పోరాటం ఫలితమే నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ఏర్పడిందని, సీఎంగా రేవంత్ రెడ్డికి ప్రజలు పట్టం కట్టారన్నారు. వరంగల్ జిల్లాలో నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాల చేయడంతోనే జిల్లాలో కాంగ్రెస్ బలంగా ఉందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రజల కోసం ఎన్ని కేసులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదని, జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామని డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంక సరళ, కార్తీక్, అయ్యుబ్, పృథ్వీ, రమేష్, సారంగం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత విద్యుత్‌కు జీరో బిల్ అందిస్తాం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు తెల్ల రేషన్ కార్డు ఉండి, అర్హులైన వారికి మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కు జీరో బిల్ అందిస్తామని వరంగల్ , హన్మకొండ సూపెరింటెండింగ్ ఇంజనీర్ మధుసూదన్ తెలిపారు. ఎవరైతే గృహ జ్యోతి పథకం పొందడానికి ఆర్హులై ఉన్నవారు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోకుండా ఉంటె లేదా ప్రజా పాలన దరఖాస్తులో ఏవైనా వివరాలు సరైనవి లేక లబ్ధి పొందక పోయిన తమ పరిధిలోని ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నెంబర్, తెల్ల రేషన్ కార్డుతో అనుసంధానమైన ఆధార్ కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. గృహజ్యోతి పథకం అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారులందరూ ఆందోళన చెందనవసరం లేదని, మీరు సమర్పించిన దరఖాస్తు ధ్రువీకరించిన తర్వాత మాకు నమోదు కోసం పంపిస్తారు. అర్హత కలిగిన వారికి సవరించి జీరో బిల్ అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఒక వేళ మీ దరఖాస్తు పెండింగులో ఉంటె దరఖాస్తు పరిశీలన అయ్యేంత వరకు విద్యుత్ సిబ్బంది బిల్ వసూలుపై ఎలాంటి చర్యలు తీసుకోరని అన్నారు.

## ‘కుల సర్వే’తో బడుగుల జీవితాలలో వెలుగులు

### వకుళాభరణం కృష్ణమోహన్ రావు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే సామాజిక, ఆర్థిక ,కుల సర్వేతో బలహీన వర్గాల జీవితాలలో మంచి రోజులు వస్తాయని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు .పేద వర్గాల సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించే దిశగా, ప్రభుత్వం ‘కుల గణన’తో ముందుకు రావడం గొప్ప నిర్ణయమని అన్నారు. బుధవారం నగరంలోని కొత్తపేటలో గల బాబూ జగజ్జీవన్ రాం భవన్ లో, తెలంగాణ మేరు సంఘం ఆధ్వర్యంలో జరిగిన “ప్రపంచ టైలర్స్ డే “ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత సర్ E Williams Howe చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ లు పాల్గొని ప్రసంగించారు. సభాధ్యక్షుడిగా తాళ్ళ వెంకట్రావు వ్యవహరించారు. మేరు సంఘం,రాష్ట్ర ప్రతినిధులు కొవ్వూరు భాస్కరరావు, పొడిశెట్టి నరసింగరావు, అడపా వెంకటేశ్వరరావు, దీకొండ నరసింగరావు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటేష్ బాబా చంద్రపాల్, సంగేవార్, రావి పాపన్న, రావి పాపన్న, కీర్తిశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ వకుళభరణం ప్రసంగిస్తూ కుట్టుమిషన్ కనిపెట్టిన E.W.HOWE స్మారకార్థం ప్రపంచ టైలర్స్ దినోత్సవం జరుపుకోవడం సముచితంగా ఉందన్నారు. రాష్ట్రంలోని దర్జీ కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సమస్యల పరిష్కారం దిశగా తమ వంతు సహకారం అందిస్తానని అన్నారు. సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ ప్రసంగిస్తూ ఎల్లవేళలా ప్రజలు అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. బీసీ వర్గాలలో ఆయా కులాలకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకువస్తే, ప్రభుత్వానికి నివేదించి, సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తరలివచ్చిన దర్జీ వృత్తిదారులు, మేరు కులస్తులు పాల్గొన్నారు.


## రైల్వే డీఎస్పీని కలిసిన సీఐ రామ్మూర్తి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాజీపేట నూతన రైల్వే డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డీఎస్పీ తాళ్లపెల్లి కృపాకర్ ను బుధవారం కాజీపేట రైల్వే సర్కిల్ ఇన్ స్పెక్టర్ మరుపట్ల రామ్మూర్తి మార్యాద పూర్వకంగా కలుసుకొని పూల బోకే అందజేశారు.

# వారికి మానవత్వం లేదా?

## పోచర్ వెబ్‌సీరిస్ చూసి మహేశ్ బాబు ఎమోషనల్




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ నిర్మాతగా మారి తెరకెక్కించిన తాజా వెబ్ సిరీస్ 'పోచర్'. ఈ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోతో కలిసి అలియా భట్ నిర్మించింది. ప్రస్తుతం ఈ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వెబ్ సిరీస్ చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు 'పోచర్'పై ప్రశంసల వర్షం కురిపించాడు. ఎవరైనా ఏనుగులను అలా ఎలా చంపగలరు. వారికి మానవత్వం లేదా? అలా చేస్తున్నప్పుడు వారి చేతులు వణకడం లేదా? ఈ క్రైమ్-థ్రిల్లర్ చూస్తున్నప్పుడు నా మైండ్ లో ఇవే ప్రశ్నలు తిరుగుతూ ఉన్నాయి. ఈ జెంటిల్ జెయింట్స్ ని కాపాడుకునేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు పోరాడాలి అంటూ మహేష్ రాసుకొచ్చాడు. కాగా ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మలయాళ నటులు నిమిషా సజయన్, రోషన్ మథ్యూ, దివ్యేంద్ర భట్టాచార్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్‌కు ఎమ్మీ అవార్డు విన్నర్ రిచీ మెహతా దర్శకత్వం వహించాడు. అమెజాన్ ప్రైమ్ లో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ సిరీస్ కథ విషయానికి వస్తే.. ఏనుగు దంతాల స్మగ్లింగ్‌తో పాటు, అడవుల్లో వన్య ప్రాణులపై దాడుల చేసే వారిపై ఈ సిరీస్ వచ్చింది. ఇక వారిని పట్టుకునేందుకు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు, ఔఉక్ష కార్మికులు, లోకల్ పోలీసులు ఎం చేశారు అనేది ఈ సిరీస్ కథ.



# నన్ను సొంతం చేసుకోండి

## నటి అనుపమ పరమేశ్వరన్ ఆఫర్



మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ బంపరాఫర్ ఇచ్చింది. తనకు ఒక ఖడ్గమృగాన్ని తెచ్చి బహుమతిగా ఇస్తే మీ సొంతం అయిపోతానని చెప్పేసింది. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎందుకంటే అనుపమ లాంటి అమ్మాయి ఆఫర్ ఇస్తే ఎవరు కాదంటారు చెప్పండి. కచ్చితంగా ఆ గిఫ్ట్ కొనిచ్చేస్తారుగా. ఇంతకీ అనుపమ ఏం చెప్పింది? అసలేం జరిగింది? మలయాళ 'ప్రేమమ్'తో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన అనుపమ.. 'అఆ' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'శతమానం భవతి', 'హలో గురు ప్రేమ కోసమే', 'కార్తికేయ 2' తదితర చిత్రాలు చేసింది. రీసెంట్‌గా రవితేజ 'ఈగల్'లో కీలక పాత్రలో కనిపించింది. ఈమె సూపర్ హాట్‌గా నటించిన 'టిల్లూ స్క్వేర్' త్వరలో థియేటర్లలోకి రానుంది. సినిమాల సంగతి పక్కనబెడితే సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటే అనుపమ.. అభిమానులతో టచ్‌లో ఉంటుంది. తాజాగా ఓ ఖడ్గమృగం పిల్లకి సంబంధించిన ఓ వీడియోని పోస్ట్ చేసి, దీన్ని ఎవరైనా తనకు బహుమతిగా ఇస్తే తను వాళ్ల సొంతమైపోతానని చెప్పింది. అంటే డేటింగ్ లేదా పెళ్లి చేసుకుంటానని ఫన్నీగా చెప్పింది. ఇప్పుడీ క్యాప్షన్‌పై ఫన్నీ కామెంట్స్ వస్తున్నాయి.

# మార్చి 1న వస్తోన్న చారి 111

'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ కథానాయికగా, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న విడుదలవుతోంది. అదితీ సోనీ మాట్లాడుతూ? నిర్మాతగా 'చారి 111' నా తొలి సినిమా. వైవిధ్యమైన కథతో తీసిన మంచి వినోదాత్మక చిత్రమిది. వెన్నెల కిశోర్ కామెడీని ప్రతి ఒక్కరు ఎంజాయ్ చేస్తారు' అన్నారు. మళ్ళీ మొదలైంది' సినిమా తర్వాత నేను చేసిన ద్వితీయ చిత్రం 'చారి 111'. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్ అన్నారు టీజీ కీర్తికుమార్. ఈ సినిమాలో ఒక్కటే పాట ఉంది. ఈ పాటని అద్భుతంగా రాయడానికి మూడు నెలల సమయం తీసుకున్నానని అన్నారు రామజోగయ్య శాస్త్రి. తెలుగులో నాకు తొలి చాన్స్ ఇచ్చిన యూనిట్‌కి థ్యాంక్స్ అన్నారు సంయుక్తా విశ్వనాథన్. ఈ సినిమాకు మ్యూజిక్ అందించడం హ్యాపీగా ఉందని అన్నారు సైమన్ కె. కింగ్.



# విడుదల మరింత ఆలస్యం

ట్రిపుల్ ఆర్ సినిమాతో ఇంటర్నేషనల్ వైడ్‌గా క్రేజ్ తెచ్చుకున్న హీరో రామ్ చరణ్ తన తరువాతి సినిమాని సెన్సేషనల్ డైరక్టర్ శంకర్ గేమ్ ఛేంజర్‌తో వస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమలో రామ్ చరణ్ డ్యూయల్ రోల్ నటిస్తున్నారు. చాలా కాలంగా షూటింగ్ జరపుకుంటున్న ఈ సినిమా ఒకనొక టైంలో 2024 సంక్రాంతికి రిలీజ్ చేస్తారని ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూశారు. అంతేకాదు ఈ సినిమా గురించి అప్డేట్స్ ఇవ్వకుంటే..ఆత్మహత్య చేసుకుంటా అంటూ బెదిరింపు లేఖలు కూడా దర్శనం ఇచ్చాయి. అయితే డైరక్టర్ శంకర్‌కు ఉన్న డిమాండ్స్ మేరకు షూటింగ్ ఇబ్బందులు, ఇంకా కొన్నిటెక్నీకల్ కారణాల వల్ల సంక్రాంతికి రిలీజ్ కాకపోడంతో పాటు ఎలాంటి అప్డేట్ కూడా ఇవ్వలేదు. దీంతో గేమ్ ఛేంజర్ రిలీజ్ ఎప్పుడనే విషయాన్ని మూవి టీమ్ సస్పెన్స్‌లో ఉంచుతూ.. షూటింగ్ మీద పోకస్ చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 80 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా రాబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. త్వరలో మేకర్స్ అఫిసియల్ డేట్ అనౌన్స్ చేసే అవకాశం ఉంది. అయితే,అక్టోబర్‌లో దసరా కనుకగా రిలీజ్ చేస్తారని చరణ్ ఫ్యాన్స్ అశపడ్డారు. కానీ, ఇప్పుడు అది కూడా కష్టంగా మారిందని తెలుస్తుంది. ఎందుకంటే దసరాకి ఎన్టీఆర్ నటిస్తున్న దేవర సినిమా వస్తుండటంతో గేమ్ చేంజర్ మూవీని క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేయాలనీ డిసైడ్ అయినట్లు సమాచారం. డైరెక్టర్ శంకర్..కమల్ హాసన్ ఇండియాన్ 2 కూడా తెరకెక్కిస్తుండటంతో..గేమ్ చేంజర్ లేట్ కు అసలైన కారణం అని తెలుస్తోంది.



# బండి సంజయ్‌పై దాడి

**కోడిగుడ్లను విసిరిన దుండగులు**

**పీవీ స్వగ్రామం వంగరలో ఘటన**



**వరంగల్ వాయిస్, వంగర :** బీజేపీ ఎంపీ బండి సంజయ్ కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో బుధవారం చోటుచేసుకుంది. ప్రజాహిత యాత్రలో భాగంగా సంజయ్ అక్కడ పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో వంగరలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఇంటిని సందర్శించారు. అనంతరం ముల్కనూర్ బయలుదేరుతుండగా ఇద్దరు వ్యక్తులు కోడిగుడ్లు విసరడంతో అవి కాన్వాయ్‌లోని మీడియా వాహనంపై పడ్డాయి. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని బీజేపీ నేతలు ఆరోపించారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ పోలీసుల సమక్షంలో కోడిగుడ్లతో దాడి జరిగినా వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకు భద్రత అక్కర్లేదు. పోలీసులు నాతో రావొద్దు. నా రక్షణ మా కార్యకర్తలే చూసుకుంటారని మండిపడ్డారు. ఈ ఘటనతో హనుమకొండ జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. బండి సంజయ్ ప్రజాహిత యాత్ర కాన్వాయ్ పై గుర్తు తెలియని దుండగులు కోడిగుడ్ల దాడితో పోలీసులు కూడా అలర్ట్ అయ్యారు. భీమదేవరపల్లి మండలం వంగరలో ఘటన జరిగింది. పీవీ నరసింహారావు స్వగ్రామంలో పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి వెళ్తుండగా కాన్వాయ్ పై కోడిగుడ్లు పడటం స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది. పీవీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రధానిగా పనిచేసిన ఏకైక నాయకుడు పీవీ నర్సింహారావు అని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ ఠీవిగా, పీవీ బహుభాషా కోవిదుడు, కవిగా, రచయితగా, జర్నలిస్టుగా పనిచేశారని తెలిపారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాన్ని గట్టెక్కించి దేశానికి ఎనలేని సేవలను చేశారని చెప్పారు. అలాంటి వ్యక్తికి భారత రత్న ప్రకటించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని అన్నారు. పీవీ లాంటి గొప్ప వ్యక్తి చనిపోతే కనీసం ఢిల్లీలో అంత్యక్రియలు జరపకుండా పీవీ ఆత్మను, ఆయన కుటుంబ సభ్యులను అడుగడుగునా అవమానించింది కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. పీవీని కాంగ్రెస్ పార్టీ ఎందుకు అవమానించిందో ఇప్పటికీ వివరణ ఇవ్వలేదన్నారు. పీవీకి భారతరత్నప్రకటించినా కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోషం కూడా వ్యక్తం చేయలేదని విమర్శించారు.

# సీఎం రేవంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో

**మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్**




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహిళలను కించపరిచే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగానే రేవంత్ రెడ్డి భాష ఉంది, ముఖ్యమంత్రి అనే సోయి రేవంత్ రెడ్డికి లేదని దుయ్యబట్టారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ మహిళలను అగౌరవపర్చే విధంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఎన్ని హామీలు ఉన్నాయో రేవంత్ రెడ్డికి తెలుసా అని ఎద్దేవా చేశారు. మహాలక్ష్మి పథకం కిందనే మూడు హామీలు ఉన్నాయి. మహిళలకు ఇస్తామన్న రూ.2,500 హామీ ఏమైందని ప్రశ్నించారు. రూ.500 రూపాయల గ్యాస్ సబ్సిడీ 40 లక్షల మందికి మాత్రమే వర్తిస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మొత్తం రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉండగా గ్యాస్ కనెక్షన్లు కేవలం మహిళల పేరు మీద ఉంటేనే సబ్సిడీ వస్తుందని ప్రభుత్వం చెప్తోంది. గ్యాస్ కనెక్షన్లు పురుషుల పేరు మీద ఉన్నా సబ్సిడీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ డబ్బులు మొత్తం కట్టించుకుని సబ్సిడీ డబ్బులు బ్యాంకు ఖాతాలో వేస్తామని అంటున్నారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పథకం బోగస్ పథకంగా మారిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల్లో మొత్తం 13 హామీలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపాలి. మహిళలకు సరిపడా బస్సులను ప్రభుత్వం నడపాలని డిమాండ్ చేశర్నా. ఆరు గ్యారెంటీల చట్టబద్ధత ఏమైందని నిలదీశారు. పింఛన్లు రూ.4,000 ఎప్పటి నుంచి అమలు చేస్తారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు చూసి ప్రజలు గుడ్డిగా ఓట్లు వేశారు. హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆరు గ్యారెంటీలు అని చెప్పి ఆరు వందల కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి పరుష పదజాలం మానుకోవాలని హితవుపలికారు. తను జైలుకు వెళ్లానని, అందరిని జైలుకు పంపాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు. ఇందిరమ్మ ఇండ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. ఎల్.ఆర్.ఎస్.ఉచితంగా అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందనే విషయం మరువకూడదని సూచించారు.

# జీవన విధానంలో సైన్స్ ఒక భాగం

**రాష్ట్ర పర్యావరణ, అటవీ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సైన్స్, టెక్నాలజీ అనేది దేశ పురోగతికి ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ. వాణిప్రసాద్ అన్నారు. బుధవారం హనుమకొండ వడ్డేపల్లి లోని ప్రభుత్వ పింగిళి డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యావరణ, అటవీ, టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ. వాణిప్రసాద్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యావరణ, అటవీ,టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ జీవన విధానంలో సైన్స్ ఒక భాగమని అన్నారు. ఏదైనా ఒక విషయాన్ని లోతుగా తెలుసుకునేందుకు సైన్స్ అనేది తోడ్పడుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలో వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

### ఆలోచింపజేసి... ఆకట్టుకున్న విద్యార్థులు

ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని శ్రీ గౌరీ స్వాగత నృత్యం చేసి ఆకట్టుకున్నారు. గీసుకొండ కేజీబీవి విద్యార్థినులు ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణంతో పాటు మానవాళి, జంతుజాలానికి కలుగుతున్న ముప్పును తెలియజేస్తూ ప్రదర్శించిన నాటిక అందరిని ఆలోచింపజేసేంది. దేవురుప్పుల జడ్పీ పాఠశాల విద్యార్థులు మేడారం జాతర నిర్వహణపై వివిధ శాఖలతో నమూనా సమీక్షా సమావేశం నిర్వహించి ఆకట్టుకున్నారు. నారాయణపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని బుజ్జమ్మ ప్లాస్టిక్ ను వాడొద్దంటూ పాడిన గీతం ఆకట్టుకుంది. ప్రాజెక్టుల ప్రయోజనాలను విద్యార్థినులను ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో తదితర అంశాల్లో పోటీలను నిర్వహించగా విద్యార్థులకు ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్, కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మెంబర్ సెక్రటరీ మారుపాక నగేష్, ప్రభుత్వ పింగిళి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. చంద్రమౌళి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో పాటు వివిధ కళాశాలలు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

### రీజినల్ సైన్స్ సెంటర్ సందర్శన ..

హనుమకొండ హంటర్ రోడ్డు జూ పార్క్ సమీపంలోని రీజనల్ సైన్స్ సెంటర్ ను రాష్ట్ర పర్యావరణ, అటవీ, టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. రీజినల్ సైన్స్ సెంటర్ లోని ఇన్నోవేషన్ ల్యాబ్ , రీసెర్చ్ సెంటర్, సైన్స్ గ్యాలరీని పరిశీలించగా వాటి వివరాలను సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నితీష్ రెడ్డి, తదితరులు వివరించారు.

# మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం

**పరమ శివుడి అనుగ్రహం ఓరుగల్లు ప్రజలపై ఉండాలి**

**ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రతీ ఏటా నిర్వహించినట్టు గానే ఈ ఏడాది ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ, హయగ్రీవాచారి గ్రౌండ్స్ లో మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఇండస్ ఫౌండేషన్ చైర్మన్, ఏనుగుల రాకేష్ రెడ్డి తెలిపారు. బుధవారం హనుమకొండ హరిత హోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఓరుగల్లు శివతత్వానికి ఆధ్యాత్మికత కు పెట్టింది పేరని, మన ఓరుగల్లు విశిష్ఠను ప్రపంచానికి చాటి చెప్పడమే ఇండస్ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే శివతత్వానికి నిలయమైన మన ఓరుగల్లులో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఆ పరమ శివుడి అనుగ్రహం, అమ్మవారి ఆశీస్సులు తోడై విజయవంతం అవుతుంది.దఇండస్ మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం వేదిక ఎందరో మట్టిలోని మాణిక్యాలను ప్రపంచానికి పరిచయం చేస్తుంది.

ప్రతీ ఏటా ఓరుగల్లు ఔన్నత్యానికి ప్రపంచానికి చాటి చెప్పే ప్రయత్నం చేస్తూ, ఓరుగల్లు కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తున్న విశిష్ట వ్యక్తులకు " కాకతీయ పురస్కారం" ఇచ్చి ప్రోత్సహిస్తూ, గౌరవించుకోవడం జరుగుతుందని తెలిపారు. శివ పార్వతీ కళ్యాణం, బ్రహ్మ శ్రీ గంగాధర శాస్త్రి, శ్రీ రాధా మనోహర్ దాస్ ప్రవచనం, సప్త హారతి, పేరిణి శివతాండవంతో పాటు ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ , చరణ్ అర్జున్ వివిధ సినీ, జానపద కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల ఆటపాటలు, నృత్యకళా ప్రదర్శనలు ఉంటాయని, ఇటీవలే తెలుగు ప్రజలకు గొప్ప చిత్రాన్ని అందించిన హనుమాన్ చిత్ర బృందానికి ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతీ ఏటా విజయవంతం చేసినట్టే ఈ ఏడాది కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇండస్ ఫౌండేషన్ మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం కర పత్రాన్ని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శేషు అయ్యగారి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇండస్ ఫౌండేషన్ మహా శివరాత్రి కార్యక్రమ నిర్వహాక కోఆర్డినేటర్లు కత్తుల అభిషేక్, ఎలగందుల దీపక్, 2వ డివిజన్ కార్పొరేటర్ రవి నాయక్, వెలేరు ఎంపీటీసీ-1 భూపతి రాజు, కార్యక్రమ నిర్వాహకులు సుకాంత్, నరేందర్ పాల్గొన్నారు.

# భద్రకాళి సేవలో ఏపీ మంత్రి రోజా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓరుగల్లు మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ మంత్రి, ప్రముఖ నటి రోజా బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన రోజాకు ఆలయ పర్యవేక్షకులు శ్రీ అద్దంకి విజయ్ కుమార్, అర్చకులు స్వాగతం పలికారు. ముందుగా ఆది శంకరాచార్యులను దర్శించిన తదుపరి వల్లభ గణపతిని దర్శించి అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ స్నపమండపంలో అర్చకులు మంత్రి రోజాకు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు బహుకరించి ప్రసాదములు అందజేశారు. అనంతరం దేవాలయంలో భక్తులు రోజాతో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com